# మేడిపండు

రచన :
" వాలేకార్ "

ట్రిక్. టక్.. టక్

టక్. టక్.. టక్ ... టక్

మిని టైప్ మిషిన్‌పై లయ బద్ధకంగా నాట్యం చేస్తున్నవి మూర్తి కరపల్లవులు.

ఆఫీస్ గోడ గడియారం ఠంగ్ ఠంగ్ మని అయిదు సార్లు కొట్టిన శబ్దం శ్రవణేంద్రియాలకు సోకగానే చేతిలోనున్న పని ముగించుకొని మిషిన్ మూత వేసి బద్ధకంగా వళ్ళు విరిచి బయటకు నడిచాడు మూర్తి.

సమయం సాయంత్రం కావడంచేత ఆఫీస్ క్లర్కులతోనూ, కాలేజి స్టుడెంట్లతోనూ రక రకాల వ్యక్తుల మహారద్దిగావుంది సిటి బస్ స్టాప్.

అత్యవసరంగా వెళ్ళవలసినవారు మాట మాటకూ వాచీల వంక చూసుకొని బస్సుపై విసుక్కుంటూ అటూ ఇటూ పచార్లు చేసేవారు కొంతమంది.

ఏ పని లేనివారు బస్సుకోసమనే సాకుతో. అందమైన మిస్‌లకోసం గాలించేవారు కొంతమంది.

ఆ కోలాహలంలో ఎవరి గొడవలు వారివే.

అక్కడున్న మనుష్యులను ఓ కంట కనిపెడుతూ వున్న మూర్తికి అల్లంతదూరంలో నిలబడ్డ వ్యక్తి ఇటు తిరిగి చూసినవెంటనే, ఇద్దరినోటంట "అరే" అన్నమాట ఒకేసారి వెలువడింది.

చాలా ఏళ్ళ తరవాత కలుసుకొన్న ఇద్దరు బాల్య స్నేహితులు కాసేపు కుశల ప్రశ్నలతో కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకొన్నారు!

ఇద్దరి మాటల్లో తేలిన సారాంశం.

ప్రభాకర్‌కు పెళ్ళయింది! ఇద్దరు పిల్లలు. ఒక ఆడ, పిల్ల ఒక మగ, ఆ తర్వాత పిల్లలు పుట్టకుండ ఆపరేషన్ చేయించుకొన్నాడు!! పొగాకు బిజినెస్ చేస్తున్నాట బిజినెస్ బాగానే జరుగుతోంది!!! బిజినెస్ పని మీదనే మద్రాస్ వచ్చాడట. భార్య పిల్లలుగూడా మద్రాస్ చూస్తామంటే కుటుంబంతో వచ్చి హోటల్ జనతాలో వున్నాడట. ఇంకా మూడు నాలుగు రోజులు వుండి వెళతాడట!

ఇద్దరి మధ్య క్షణాలు మౌనంగా కరిగెడుతున్నవి.

ఆ మౌనంలోనే మూర్తి మనసు: జీవితంపై ఈర్షతో నిండుతూ తుఫానులోచిక్కుకొన్న నావలా కొట్టుమిట్టాడసాగింది!

ఇంత చదువుకొన్న తనకంటే ఎక్కువ చదువులేని ప్రభాకరే నయం! మహారాజులాగ జీవితాన్ని గడుపుతున్నాడు! మెడలో బంగారు గొలుసు వేళ్ళకు ఉంగారాలు, చేతికి ఫారన్ వాచీ, రిమ్‌లెస్ కళ్ళజోడు, కరీదైన బట్టలు.

తను బి. ఏ. డిగ్రీ తీసుకొన్నా, ఇంతవరకూ భార్యకు ఒక మంచి నెక్లేస్ అయినా కొనలేదు.

మనకున్న సమస్యల్లో అధిక సమస్య నిరుద్యోగ సమస్య. ఆ సమస్యను చాలారోజులు ఎదుర్కొని చివరకు ఈ క్లర్కు వుద్యోగం సంపాయించుకొని చివరన మద్రాస్ ట్రాన్స్‌ఫర్ అయి ఇక్కడే స్థిరపడ్డాడు.

వీరిద్దరి మౌనాలను భంగ పరుస్తూవచ్చిన ఓ వ్యక్తి నలభై సంవత్సరాల వ్యక్తి! బాబు!!... నా భార్య ప్రసవ వేదనలోవుంది. బాలింతరాలుకు కడుపులో కొంచం జావకాచి పోయడానికి ఇంట్లో ఏమీలేదు. దయచేసి ఏదైన సహాయంచేయండి. అంటూ చేతులు జోడించి ప్రాధేయ పడుతున్నాడు.

వెళ్ళు వెళ్ళవయ్యా! అడుక్కోటినే ప్రతివారికి ఇదో ఫ్యాషన్ అయిపోయింది, తెల్లారిన మొదలు మా

అమ్మకు జబ్బు, మా నాన్నకు జబ్బు, పెళ్ళాంకు జబ్బు పిల్లలకు జబ్బు అని డబ్బు దండుకోవడం, తరవాత సినిమాలు షికార్లు జల్సాలు చేయడం స్థూలకాయుడిలా వున్నావు. దేవుడిచ్చిన కాళ్ళు చేతులు గట్టిగా బాగానే వున్నాయి. ముష్టి అడుక్కోకపోతే, కష్టపడి పనిచేసుకో లేవూ? అంతగా పనిచేయలేనివాడివి, పిల్లల్ని ఎందుకు కనాలయ్యా హాయిగా "నిరోధ్" వాడకూడదు? ఈ రకంగానైనా భూ భారం తగ్గించినవారవుతారు. ఈ రోజుల్లో అన్ని వస్తువులకంటే వెల తక్కువైనది. ప్రతి చోట దొరికేది కల్తీ లేనిది "నిరోధ్" ఒకటే.

అని ప్రభాకర్ చేసిన వెటకారానికి చిన్న బుచ్చుకొన్న ఆ వ్యక్తి, తలవంచుకొని ముందుకు వెళుతుంటే 'ప్రభాకర్' మాటలకు ఆ వ్యక్తి దీన పరిస్థితికి మూర్తి మనసు చివుక్కుమంది. తనకన్నా ఎక్కువ స్థాయిలోవున్న ప్రభాకర్‌ను చూసి తను ఈర్ష పడి తన్నుచూసి తన కన్నా తక్కువ స్థాయిగలవాళ్ళు తనపై ఈర్ష పడడం సహజమే అనుకొన్న మూర్తి, దేముడు తనకు ప్రభాకర్ స్థాయిని ఇవ్వకపోయినా ఆ వ్యక్తి స్థితిలోవుంచనందుకు మనసులోనే సంతోషించి వెళ్ళనున్న ఆ వ్యక్తిని పిలిచి అర్థ రూపాయ ఇచ్చిపంపాడు.

అంతలో మూర్తి వెళ్ళనున్న బస్సు, ఆడా మగా తేడా తెలియని జనంతో నిండు గర్భవతిలా ముందుకు వచ్చి ఆగగానే స్నేహితుని దగ్గర సెలవు తీసుకొన్న మూర్తి తన అడ్రస్ ప్రభాకర్ చేతిలో పెట్టి ఆదివారం తప్పకుండా కుటుంబ సమేతంగా తమ ఇంటికి భోజనానికి రమ్మని చెప్పి కిట కిట లాడుతున్న బస్సులోకి అతికష్టంపై ప్రవేశించి అంతరిక్ష యానం చేసిన "గగారిన్"లా విజయ గర్వంతో హమ్మయ్య అని ఓ నిట్టూర్పు విడిచాడు!

కదిలిన బస్సుతో ప్రకృతి అంతా వెనక్కు పరిగెడుతుంటే మూర్తి మనసు ప్రభాకర్ పైనే నిలిచి వుంది.

తనూ ప్రభాకర్ ఒకేవూరులో పుట్టి ఒకేవీధిలో పెరిగి ఒకేబడిలో చదువుకునేవారు.

ఇద్దరూ స్కూల్ ఫైనల్ వరకూ చదువుకొన్నారు. ఆపై ప్రభాకర్‌కు చదువు ఒంటపట్టక అల్లరి చిల్లరిగా తిరగడం నేర్చుకొన్నాడు. వాని ప్రవర్తనకు ఇంట్లో తల్లి తండ్రులు కోపగించుకొంటే ఇల్లువదలి వూరువదలి పారిపోయేవాడు! వారం పదిరోజులకు తిరిగి వచ్చే టప్పుడు, మంచి బట్టలతో చేతినిండా డబ్బుతో వచ్చేవాడు.

ఎవరైనా అంతడబ్బు ఎలాసంపాదిస్తున్నావని అడిగితే ఆమాటకు ప్రభాకర్ కొత్త వ్యాపారాన్ని కనిపెట్టానని చిరునవ్వుతోనె సమాదానం చెప్పేవాడు! వున్న నాల్గు రోజులు సరదాగా గడిపి మళ్ళి ఊర్లపైకి వెళ్ళేవాడేకాని ఆ వ్యాపార రహస్యం మాత్రం ఎవ్వరికి చెప్పేవాడు కాడు.

ఇలాగే సాగింది ఇద్దరి బాల్యవయసు!...!!! ఆరోజు శనివారం కావడంచేత ఆఫీసులో చక చకా టైపు చేస్తున్న మూర్తికి సార్ అన్న సన్నని గొంతు వినబడి తలెత్తి చూసాడు!

ఎదురుగా ఓ పదేళ్ళ కుర్రాడు నిలబడి ఏదో చెప్ప డానికి సందేహిస్తుంటే ఏమిటన్నట్టుగా చూసాడు మూర్తి!

మాది ఈ ఊరు కాదుసార్! మా నాన్నగారి కళ్ళు ఆపరేషన్ కోసం మద్రాసు వచ్చాము!! నిన్ననే రాయపేట ఆసుపత్రిలో చేర్చాము. మూడురోజుల నుండి మా వాళ్ళకు అన్నంలేదు. మాఅమ్మ ఆకలి భరించలేక మూర్చ వచ్చి పడివుంది. మా వాళ్ళంతా ఆకలితో బాధ పడుతున్నారు. దయచేసి మీకు తోచిన సహాయం చేయండి.

అంటూ దీనంగా నిలబడ్డాడు ఆ పదేళ్ళ పనివాడు.

లేత చిగురాకు వంటి పెదవులతో విరిసి విరియని కమలంలా వున్న ముఖంతో చక్రాలాంటి కళ్ళకు

విచిత్రంగా తిప్పుతూ స్వచ్ఛమైన తెలుగులో చక చక మాట్లాడేస్తున్న నిండుగా ముద్దుగా బొద్దుగా వున్న ఆ వక్రాడి మనసు పాపం అనుకొంది!

!నీ పేరేంటి "బాబూ"

ఆప్యాయతంగా అడిగాడు మూర్తి!

సత్యం! సార్ చెప్పాడు!

ఏ వూరు??

భీమవరం!

మీ వాళ్ళంతా ఏంచేస్తుంటారు???

మా అన్నలిద్దరూ చదువులకు గుంటూరు వెళ్ళారు మా అమ్మ ఇళ్ళల్లో పని చేస్తుంటుంది. మానాన్నగారికి కళ్లుపోయినప్పటినుండి పనులకు వెళ్ళేందుకు వీలుపడక మానాన్నగారి మంచి చెడు చూడడానికే సరి పోతుంది.

పాపం! ఇంత చిన్న వయసులోనే దేముడు, అన్ని కష్టాలు ఈ వక్రాడికే పెట్టాడేమిటా అనుకొన్న మూర్తి మనసు వెన్నెలా కరిగిపోయింది! పర్సుతీసి ఓ రూపాయ కాయితం అవక్రాడి చేతిలో పెట్టాడు.

మూర్తి టేబుల్ ముందునుండి కదిలిన సత్యం ప్రక్కనున్న సుబ్బారావు దగ్గిర, అడిగి . ఆ పై కూర్చున్న ఓ మిస్ దగ్గర అడగగానే ఆమెగూడా జాలితలచి ఓ రూపాయి ఇవ్వగానే మరి ముందు వరుసలో నున్న ప్రతివారిని దగ్గరకెళ్ళి, తనదగ్గర చెప్పిన మాట లను కంఠస్థం పట్టినవానిలా గడ గడమని చెప్పేస్తుంటే ఆమాటలకు మిగతాక్లర్కులు అవక్రాడిపై జాలి, లేక ఆమె ముందు తమంతా నిజాయితిని చాటుకోవాలను కొన్నారో తెలియదు గాని ఆమె ప్రేమను ఆరాధించాలనేనేమో కాబోలు, ఆమె తమని గమనించే విధంగా నటిస్తూ, అందరూ చేతికి ఎంత అందితే అంత ఆ వక్రాడిచేతిలో పెట్టారు.

ఎలాగైతేనేం వంద మందికి పైగ వున్న ఆస్టాఫ్‌లో బాగానే ముట్టింది సత్యం చేతికి.

చేతినిండా డబ్బుపట్లుకొని ఒక్కసారి ఆఫీస్ అంతా కలియచూసి నిండా అందరికి చేర్చి ఓ కృతజ్ఞతా చూపు విసరి వెళుతువ్న సత్యాన్ని చూస్తూ పాపం దేముడు పొర పాటున ఈ సత్యాన్ని కష్టాలబుట్టలో పార వేశాడేమో అని మనసులోనే అనుకొన్నాడు...

అనుకొన్న ఆదివారం రానే వచ్చింది!

ప్రభాకర్ భార్యపిల్లలతో వచ్చాడు. ఈమె నా భార్య పేరు సుసీల వీళ్ళిద్దరూ మా సంతానం. మురళి, పద్మ అని మూర్తికి పరిచయం చేశాడు.

ప్రభాకర్ పిల్లలిద్దర్ని దగ్గరకు తీసుకొంటున్న మూర్తికి మురళిని చూడగానే కొరడాతో ఛరిచినట్టయింది. ఏమీ ఎరగనట్టు నిలిచివున్న మురళి రోజూ తనలాంటి వారిని ఎంతో ముందిని చూస్తూ తన్ను గుర్తుపట్టలేదు కాబోలు తనకు మాత్రం మురళి బాగా తెలుసు. మురళీ ఎవరో కాదు, నిన్న తండ్రికళ్ళు ఆపరేషన్ అని చెప్పి ఆఫీసులో ముష్టి ఎత్తుకొన్న సత్యమే ఈ మురళి.

అప్పుడు అర్థమైంది మూర్తికి. చిన్నప్పుడు ప్రభా కర్ డబ్బు ఎలా సంపాయించినది, ఇప్పుడు అంత విలువగల వస్తువులు వంటిపై ఎలావచ్చినవి, అందుకే ఊరూరు తిరిగిన ప్రభాకర్‌కు తెలియని భాష అంటూ ఏదీ లేదు.

ఆరోజు సాయంత్రం వరకూ ఏమీ తెలియని వాడిలా నటించి సాయంత్రం మిత్రుని దగ్గర విడ్కోలు తీసుకొని టీవిగా దర్జాగా వెళుతున్న ప్రభాకర్‌ను చూస్తున్న మూర్తి—

'ముష్టివాళ్ళే. ఈరోజుల్లో దొరలు'

వండుకొన్న అమ్మకు ఆయాసం, దండుకొన్న అమ్మకు పాయాసం! అనుకొన్నాడు మనసులోనే . !